# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 06 మే, 2026 | పేజీలు :04


## కార్మిక లోకం కదం తొక్కాలి



మెయిన్‌లో

# ఖబర్దార్ కెటిఆర్.. నోరు అదుపులో పెట్టుకో

### మంత్రి అడ్లూర లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని , లేదంటే రాష్ట్రంలోని 33 జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. కరీంనగర్‌లో పిఎంజే జ్యువెల్లరీ షాప్‌లో ఆదివారం జరిగిన సంఘటనలు , గాయపడ్డ బాధితులను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో మంత్రి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ జువెల్లరీ షాప్‌లో జరిగిన దొంగతనం కాల్పుల ఘటన దురదృష్టకరమని అన్నారు. అంతరాష్ట్ర దొంగల ముఠా రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళిక ప్రకారం దొంగతనం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. కరీంనగర్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకోవడానికి 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, నేరస్థులను పట్టుకోవడానికి ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. బాధితుల పరామర్శ పేరుతో కరీంనగర్‌కు వచ్చిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నోటికి వచ్చిన విధంగా మాట్లాడారని మంత్రి మండిపడ్డారు. అంతరాష్ట్ర దొంగలను రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రితో పరిచయం ఉందని కెటిఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న టిఆర్ఎస్, బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు ఆనాటి సీఎం కెసిఆర్ బాధ్యత వహిస్తాడా? అని ప్రశ్నించారు. అంతరాష్ట్ర దొంగలకు ముఖ్యమంత్రికి సంబంధాలు ఉన్నాయని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంథనిలో జరిగిన జంట హత్యల ఘటనలో ఇద్దరు న్యాయవాదులు మరణిస్తే నాడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ఎందుకు బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్ల దళితులపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తే ఎందుకు నేటికీ కెటిఆర్ నోరు మెదపలేదన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది మరణిస్తే బాధితులను నాటి సీఎం కెసిఆర్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.



## ఎడపల్లి మండలంలో
# దొంగల బీభత్సం

### ఐదు బోర్ల మోటార్ల ప్యానెల్ బోర్డుల చోరీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ పరికరాలను లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. పొలాలకు సాగు నీరు అందించే మోటార్ల ప్యానెల్ బోర్డులను ఎత్తుకెళ్లి రైతులకు కన్నీరు మిగిలిస్తున్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని సాటాపూర్ గేట్ సమీపంలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలానికి చెందిన రైతు కరుటూరి రామకృష్ణకు సాటాపూర్ గేట్ సమీపంలోని సర్వే నంబర్లు 597, 590, 599లలో 17ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

ఆదివారం ఉదయం ఆయన తన పొలంలోని ఐదు బోర్ల ద్వారా నీటి పారుదల పనులను ప్రారంభించారు. మోటార్లు వేసిన అనంతరం ఆయన ఇంటికి వెళ్లారు. తిరిగి సాయంత్రం పొలానికి వచ్చి చూడగా, ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. ఐదు బోర్లకు సంబంధించిన విద్యుత్ ఫ్యానెల్ బోర్డులను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గమనించారు. పగటిపూట అందరూ తిరిగే సమయంలోనే దొంగలు ఈ ఘటనకు ఒడిగట్టడం స్థానికంగా కలకలం రేపుతోంది. చోరికి గురైన ఫ్యానెల్ బోర్డుల విలువ వేలల్లో ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. సాగు పనుల్లో తీరిక లేకుండా ఉన్న సమయంలో ఇలాంటి ఘటన జరగడం పట్ల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్లముందే ఉన్న వస్తువులను మాయం చేస్తే ఇక వ్యవసాయం చేయడం ఎలా, పగలు కూడా పొలాల దగ్గర వస్తువులకు రక్షణ లేకుండా పోతుందని బాధిత రైతు రామకృష్ణ వాపోయారు. ఈ మేరకు రామకృష్ణ ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలాల వద్ద అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రైతు శ్రీధర్ మృతి

**ప్రజాపక్షం/సారంగాపూర్:** తన పొలానికి పక్కనున్న వ్యక్తి దారి ఇవ్వడం లేదని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టున్నా తమ సమస్యను తీర్చడం లేదనే వేదనతో గత నెలలో 29న కలెక్టర్ కార్యాలయంలో రైతు గజ్జ శ్రీధర్ (37) అధికారుల ఎదుటే పురుగుల మందు సేవించాడు. చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఎస్.ఐ. శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన దాశెట్టి గంగయ్య గత కొంత కాంలంగా పక్కనే పొలం ఉన్నటువంటి గజ శ్రీధర్‌ను పొలానికి దారి ఇవ్వనని వేధిస్తుండడంతో మొర పెట్టుకున్నాడు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించించిన తమ సమస్యను తీర్చడం లేదని తమను చావే శరణ్యమని కలెక్టరేట్ కార్యాలయంలో పురుగుల మందు సేవించాడు. అనంతరం అధికారులు హాస్పిటల్‌కి తరలించారు. వారం రోజుల పాటు చికిత్స పొంది సోమవారం మృత్యువాత పడ్డాడు. మృతుని ప్రేమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన దాశెట్టి గంగన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్. శ్రీకాంత్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రైతు ఆత్మహత్య సంఘటన జిల్లాలోనే సంచలనం సృష్టించగా రైతుల సమస్యలను అధికారుల వద్దకు ఎన్నిసార్లు తీసుకెళ్ళినా నామ మాత్రంగానే చూస్తున్నారని మండలంలో ఇలాంటి సమస్యలు చాలానే ఉన్నాయని అధికారుల జాప్యంతోనే ఇలాంటి సంఘటనలు కొనసాగుతున్నాయని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



# ధర్మపురిలో భారీ మొత్తంలో ఇసుక డంపులు సీజ్



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని గోదావరి నది తీరాన అక్రమంగా నిలువచేసిన ఇసుక డంపులను మంగళవారం ధర్మపురి తహసిల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టుకుని సీజ్ చేశారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గోదావరి తీరాన అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు.సుమారు 3 ట్రిప్పుల ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఇసుక డంపులు ఏర్పాటు చేసినా, అక్రమ రవాణా చేసినా వాటిని పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కరరావు, జిపిఓ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

# ఇల్లందకుంటలో బిజెపి సంబరాలు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** నిన్న వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఇల్లందకుంట మండలంలో బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బైరెడ్డి రమణా రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే 2029 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అబ్బిడి తిరుపతి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుల రమేష్, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు కంకణాల రవీందర్ రెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, కంకణాల సురేందర్ రెడ్డి, ఎండీ షఫీ, మహిళా మోర్చ అధ్యక్షురాలు గుడికందుల పావని, తాళ్ల పాపిరెడ్డి, చింతల ఐలయ్య, కొక్కుల దేవేందర్, మురహరి గోపాల్, నల్ల దేవేందర్ రెడ్డి, చదువు సాయి రెడ్డి, కండె స్వామి దాస్, ఛీపతి శ్రీకాంత్, దేవునిరి లచ్చన్న, మాధవరెడ్డి, రమేష్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరు

### మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి సిఆర్ఆర్ ఎస్సీ కాంపోనెంట్ కింద 35 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిధుల కేటాయింపుతో ఓడేడు గ్రామంలోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి మార్గం సుగమమైందని వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటగిరి శ్రీనివాస్,తీగల సత్యనారాయణరావు, వార్డు సభ్యులు రవీందర్, నాగరాజు,తోట సుధాకర్,సంపత్ రావు,కొలిపాక చంద్రయ్య,రాజయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండల పరిధిలోని నందగిరి గ్రామంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్ట్యా ఉపాధి హామీ కూలీలకు సోమవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుంకరి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల కిసాన్ సెల్ అధ్యక్షులు పటేల్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీళ్లు ఎక్కువగా తాగుతూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు.



## వడ్లు కొనుగోలు చేయాలని తహసీల్దార్‌కు రైతుల వినతి



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల పరిధిలోని ఐకెపి, ప్యాక్స్, నాబార్డు కేంద్రాలలో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ గుమ్లాపూర్ రైతులు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 25 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఒక్క లారీ వడ్లు సైతం కొనుగోలు చేయడం లేదన్నారు. అడిగితే రైస్‌మిల్లులను దూరంగా అలాట్‌మెంట్ చేయడంతో రవాణా ఇబ్బందిగా ఏర్పడుతుందని సమాధానమిస్తున్నారని వాపోయారు. మండల కేంద్రం నుంచి ఇతర మండలాలు ఉన్న రైస్‌మిల్లులకు కేటాయించడంతో దూరమవుతుందని, అందుకోసమే కొనుగోలు చేయడం ఆలస్యం అవుతుందని సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ కొనుగోలు చేయాలని, కానీ బి గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.తాజా మాజీ ఎంపిటిసి బత్తుల లక్ష్మి నారాయణ, విలాసాగర్, అంజయ్య, సత్యనారాయణరెడ్డి, కాసవేని శంకర్, లక్ష్మారెడ్డి, సాగర్ రెడ్డి, మల్లయ్య, అశోక్ రావు, అంజయ్య, వెంకటేష్, రామయ్య, రైతులు పాల్గొన్నారు.

### ఐవివై విద్యార్థి మౌంట్ కోసి యాస్కో అధిరోహణ

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ధైర్య యాత్ర



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** నగరంలోని స్థానిక సీతారాంపూర్ లోని ఐవివై పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి లెంకల వివేకానందరెడ్డి ప్రపంచంలోని ఏడు శిఖరాలలో రెండవదైన ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసియాస్కో ను విజయవంతంగా అధిరోహించాడు. గత సంవత్సరం సైతం ప్రపంచంలో ఏడు శిఖరాలలో ఒకటైన యూరప్ లోని మౌంట్ ఎల్బస్ 5642 మీటర్ల ఎత్తైన హిమంతో నిండి కప్పబడి ఉన్న శిఖరాన్ని సైతం అధిరోహించాడు. ఈ యాత్రను ఆయన సెవన్ సమ్మిట్ లక్ష్యంతో చేపట్టగా తన తండ్రి మహిపాల్ రెడ్డి ప్రోత్సాహం ఎంతో కీలక పాత్ర పోషించింది. ఈ పర్వతారోహణ కేవలం ఒక సాహసం మాత్రమే కాకుండా సమాజానికి ఒక శక్తివంతమైన సందేశం. డ్రగ్స్‌కు దూరంగా ఆరోగ్యానికి దగ్గరగా .. డ్రగ్స్ వదిలేసి డ్రీమ్స్ పట్టుకో.. మత్తు వద్దు మంచి భవిష్యత్తు కావాలి.. అనే నినాదంతో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశ్యంతో తన ధైర్యాన్ని చాటి చెప్పాడు. తన తదుపరి లక్ష్యంగా గ్రేట్ డివైడింగ్ రేంజ్ శిఖరాలను అధిరోహించాలని సంకల్పించిన ఆయన పట్టుదల ఉంటే ఏ పర్వతం ఎత్తైనది కాదు అని నిరూపించాడు. ఈ సంధర్బంగా పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఇంత గొప్ప విజయాన్ని సాధించిన వివేకానందను అభినందిస్తూ అతని తల్లిదండ్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం ఇతర విధ్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

## ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చేయూత కోసం కపిల్ విద్యా వారధి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** పదో తరగతి పూర్తి చేసుకుని ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకోవడానికి చేయూతనదించడానికి కపిల్ విద్యా వారధి (సంక్షేమ ట్రస్ట్) ముందుకొచ్చింది. పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో 202526 విద్యాసంవత్సరంలో విద్యను అభ్యసించి 520 మార్కులు సాధించిన విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో స్థిరపడే వరకు అయ్యే ఖర్చులతో పాటు వారికి మానసిక ధైర్యాన్ని, నైపుణ్యాన్ని అందించడమే కపిల్ విద్యావారధి సంక్షేమ ట్రస్టు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ పథకం కింద లబ్ది పొందాలనుకునే విద్యార్థులకు కరీంనగర్ లోని సరస్వతి శిశుమందిర్‌లో మే 20 న అర్హత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. (గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, ఇంగ్లీష్) ఆధారంగా ప్రశ్నపత్రం కేవలం ఇంగ్లీష్ మీడియంలోనే ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని వారు, సింగిల్ పేరెంట్ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కరీంనగర్, జగత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు మాత్రమే ధరఖాస్తు చేసుకోవడానికి , అర్హత పరీక్ష రాయడానికి అర్హులు అని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మే 15 లోపు www.kapilvidyavaradhi.com వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు అప్పిడి రాజిరెడ్డి 9848526865, గీకురు శ్రీనివాస్ 9985482292 లను సంప్రదించవచ్చని తెలిపారు.

## పలు వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** పట్టణ పరిధిలో 30వార్డులకు సంబంధించిన శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నవారిలో కొన్ని మార్పులు చేస్తూ అన్ని వార్డులకు గాను జవాన్లు సవరిస్తూ టీం వర్క్ చేస్తూ శానిటేషన్ విభాగంలో చేస్తున్నటువంటి టీమ్ వర్క్ పనులను 5,8,23 వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం ప్రజలకు అన్ని విధాలుగా మా పాలకవర్గం అందుబాటులో ఉంటామని ప్రజలు వంతు సహాయ సహకారాలు ఉంటాయని ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ గ కౌన్సిలర్స్ యట్ల సునీత అశోక్, కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

## ఘనంగా విద్యుత్ ఉద్యోగుల భద్రత వారోత్సవాలు




**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట సబ్ డివిజన్ లో కొత్తపల్లి సాయి అంజన్న ఫంక్షన్ లో విద్యుత్ ఉద్యోగుల భద్రత వారోత్సవాల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ డిఈ ఆధ్వర్యంలో జరిగిన సభలో రౌతు వేణుగోపాల్ కొత్తపల్లి లైన్మెన్ గా విధులు వేల ఇంద్రజాల ప్రదర్శన అద్భుతమైన మ్యాజిక్ ప్రదర్శన చేసి విద్యుత్ ఉద్యోగస్తులను ఆశ్చర్యపరిచాడు. అద్భుతంగా ఇంద్రజాల ప్రదర్శన చేసిన వేణుగోపాలను, హుజురాబాద్ డిఈ లక్ష్మా రెడ్డి ఘనంగా సన్మానించారు.

## ముత్తారంలో బ్యాంకుల తనిఖీలు



**ప్రజాపక్షం/ముత్తారం :** కరీంనగర్‌లో ఇటీవల జరిగిన భారీ చోరీ నేపథ్యంలో ముత్తారం ఎస్సై రవికుమార్ మంగళవారం మండల కేంద్రంలోని పలు బ్యాంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ఎస్‌బీఐ,తెలంగాణ గ్రామీణ బ్యాంక్, వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులను తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.అనుమానితుల తనిఖీ బ్యాంకు పరిసరాల్లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ప్రశ్నించి,వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కరీంనగర్ చోరీ ఘటనను దృష్టిలో ఉంచుకుని, బ్యాంక్ అధికారులు,సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవికుమార్ ఆదేశించారు.అలాగే బ్యాంక్ అధికారులకుభద్రతా సూచనలు చేశారు.బ్యాంకుల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి,ఏవైనా అనుమానాస్పద సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

## అంగన్వాడి కేంద్రాలలో పోషకాహార పంపిణీ

**ప్రజాపక్షం/రాయికల్ :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా రాయికల్ మండలంలోని రాయికల్,ఇటిక్యాల, రామారావు పల్లె అంగన్వాడీ కేంద్రాలలో సీడీపీఓ జయప్రద ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు బరువులు ఎత్తులు తల్లులకు అవగాహన కలిగించి వారికి 25 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు బియ్యము పప్పు నూనె గుడ్లు, పాలు బాలామృతము పంపిణీ చేశారు.అనంతరం సిడిపిఓ జయప్రద తల్లులకు ఎండలు బాగా ఉన్నందున పిల్లలు, తల్లులు తీసుకొనవలసిన జాగ్రత్తలు అవగాహన కల్పించారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు

**ప్రజాపక్షం/ధర్మపురి:** రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటలు,ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని ఉద్యాన శాఖ అధికారి ఎం.అర్చన సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రాణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు ఉపయోగపడే విధంగా ఉద్యాన పంటల సాగు,ఆయిల్ పామ్ సాగు విస్తరణ,ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి లు హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ అవగాహన కల్పించారు.అదేవిధంగా నీటి వినియోగం, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు సొల్ల భీమయ్య,పొలాస శాస్త్రవేత్త వై.స్వాతి,నియోజకవర్గ ఏవో లు,ఏఈఓ లు,హెచ్ఈఓ లు,ఆయిల్ పామ్ ప్రతినిధులు,ఆదర్శ రైతులు పాల్గొన్నారు.




## ప్రకటనల ఆదాయం మున్సిపాలిటీలకే చెందేలా చర్యలు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్, ఫ్లెక్సీలు వంటి వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం నేరుగా మున్సిపల్ ఖాతాల్లోకి మళ్లించేలా నూతన విధానం తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల పరిధిలో ప్రైవేట్ భవనాలు, ప్రధాన కూడళ్లలో భారీ ఎత్తున ప్రకటనల హోర్డింగ్స్ ఏర్పాటు చేయబడుతున్నప్పటికీ, వాటి ద్వారా వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం ప్రైవేట్ కాంట్రాక్టర్లకే చేరుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం ఆయా మున్సిపాలిటీలకే చెందేలా మార్గదర్శకాలు రూపొందిస్తే మున్సిపాలిటీల స్వయం ఆదాయ వనరులు పెరిగి, ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడటం తగ్గి, స్థానిక అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రకటనల నియంత్రణలో పారదర్శకత పెరుగుతుందని, ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం తరపున విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## నిజామాబాద్‌లో రాష్ట్ర 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర 2వ ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో మెట్‌పల్లి మున్సిపల్ బృందం పాల్గొంది.ఈ సమావేశంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మెట్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆర్థిక సంఘం చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీకి రావాల్సిన నిధులు, పట్టణ అభివృద్ధి పనులు, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో చర్చించారు.మెట్‌పల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లాలోని ఇతర మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ మంథని విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేడే వారోత్సవాల్లో భాగంగా, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంథని అసిస్టెంట్ లేబర్ అధికారి రవీందర్ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సు జరిగింది.ఈ సందర్భంగా మంథని కార్మిక శాఖ అధికారులు మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రమాద బీమా,పని ప్రదేశాల్లో భద్రత,వివిధ కార్మిక చట్టాల గురించి గ్రామస్తులకు, కార్మికులకు వివరించారు.కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి రవీందర్, జూనియర్ అసిస్టెంట్ రాము,కార్మికులు మద్రి సతీష్,నరెడ్ల సంపత్,సోమవారం రాజయ్య తోపాటు కార్మికులు పాల్గొన్నారు.

## అస్తమాను నిర్లక్ష్యం చేయొద్దు




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** అస్తమాను నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురికావద్దని మెడికవర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్రచారి అన్నారు. వరల్డ్ అస్తమా డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రచారి మాట్లాడుతూ దగ్గు, ఆయాసం, అలర్జీ మాత్రమే అస్తమా లక్షణాలన్నారు. అస్తమా అంటు వ్యాధి కాదని, దుమ్ము, చల్లగాలి ద్వారా మాత్రమే ఊపిరితిత్తులు రియాక్షన్ అవుతాయని వెల్లడించారు. అస్తమా వచ్చిన వారు జీవితాంతం మందులు వాడాల్సిన పని లేదని, అస్తమాను త్వరగా గుర్తిస్తే నయం చేయడం సులువు అవుతుందన్నారు. అస్తమాకు ఇన్‌హెలర్ తో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా మంచి ఫలితాలు ఉంటాయని, ఇన్‌హేలర్‌పై ఉండే అపోహలు నమ్మవద్దని చెప్పారు. అస్తమాను తగ్గించుకునేందుకు ట్యాబ్లెట్ల కంటే ఇన్‌హేలర్‌ను వాడడం మంచిదన్నారు. అస్తమా వందులు జీవితాంతం వాడాల్సిన పనిలేదని, ఆ వ్యాధిపై భయం వీడాల్సిన అవసరం ఉందన్నారు. దుమ్ము, చల్లగాలికి దూరంగా ఉండడం, పడని వస్తువులు తినకుండా ఉండడంతో అస్తమాను దరిచేరకుండా చేయవచ్చని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్‌తో అస్తమాను పూర్తిగా దూరంగా చేయవచ్చని అన్నారు. అస్తమా దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమస్య వచ్చాక ఇబ్బంది పడేకంటే రాకుండా కాపాడుకోవడం ఉత్తమమని వెల్లడించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, సూపరింటెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ పాల్గొన్నారు.

## స్వయంకృషితో ఎదిగిన అరవింద్‌పై విమర్శలా?



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ఎంపీ ధర్మపురి అరవింద్‌పై మాజీ మంత్రి దివంగత జువ్వాడి రత్నాకర్ రావు కుమారుడు జువ్వాడి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు 'గురివింద గింజ' సామెతను గుర్తు చేస్తున్నాయని బీజేపీ నాయకుడు నిశాంత్ కార్తికేయ విమర్శించారు. మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు లేని కృష్ణారావు కేవలం ప్రచారం కోసం దిగజారుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.జువ్వాడి కృష్ణారావు ఇప్పటికీ తన తండ్రి పేరుతోనే రాజకీయ గుర్తింపు పొందుతున్నారని, గత ఎన్నికల్లో తమ రాజకీయ ప్రయోజనాల కోసం రత్నాకర్ రావును ప్రచారానికి వినియోగించుకున్నారని ఆరోపించారు.ఎంపీ ధర్మపురి అరవింద్ ఎప్పుడూ తన కుటుంబ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకోకుండా, స్వయంకృషితో ప్రజల్లో స్థానం సంపాదించుకున్న నాయకుడని పేర్కొన్నారు. ప్రధాని నాయకత్వంపై విశ్వాసంతో, తన వ్యక్తిత్వం మరియు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజాదరణ పొందారని తెలిపారు.నియోజకవర్గానికి నిధులు తీసుకురావడం, పసుపు రైతుల సమస్యల పరిష్కారం, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అరవింద్ కీలక పాత్ర పోషించారని, వాటిని చూసి కాంగ్రెస్ నాయకులు భయంతో విమర్శలకు దిగుతున్నారని అన్నారు.రాహుల్ గాంధీ వస్త్రధారణపై అరవింద్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాల ఆధారంగానే ఉన్నాయని, విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఇక్కడ సాధారణ వ్యక్తిగా కనిపించేందుకు ప్రయత్నించడం కాంగ్రెస్ నాయకత్వానికి అలవాటైందని విమర్శించారు.2009 నుంచి జరిగిన ఎన్నికల్లో ప్రజలు జువ్వాడి కుటుంబాన్ని తిరస్కరించారని, 2023 ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైన నాయకులు ప్రజాభిమానంతో గెలిచిన అరవింద్‌ను విమర్శించడం సమంజసం కాదన్నారు.విలువలతో కూడిన రాజకీయాలకే బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని చాపల కుంటలో మంగళవారం స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్‌కుమార్ చేతుల మీదుగా ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని చిన్న చిన్న కుంటల ద్వారా నీటి నిలుల చేసుకుంటే రైతన్నకి చాలా ఉపయోగపడుతుందని, ఉపాధీ హామీ ఇచ్చి పనుల ద్వారా చెరువులను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏఎంసీ చైర్మన్ లెంకల లక్ష్మణ్, జక్కుల నరేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం తిర్మలపూర్ 33కెవి ఉప కేంద్రం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున విద్యుత్ సరఫరా బుధ వారం ఉదయం 06:30 గంటల నుండి 11:00 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు రామన్న పేట ట్రాన్స్కో ఏ ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.దీని వలన మల్యాల మండలం రాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో గల రాంపూర్, ఓబులాపూర్ , ఒడ్డెర కాలనీ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వివరించారు.

## ఎంపి ధర్మపురి అరవింద్‌పై విమర్శలు ఖండనీయం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు.ఎంపీ అరవింద్ దేశాభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకుడని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ రహదారులు, నవోదయ పాఠశాలలు,కేంద్ర విశ్వవిద్యాలయాలు, వైకుంఠధామాలు, రేషన్ బియ్యం, మరుగుదొడ్లు, డ్రైనేజీలు, ఎల్ఈడీ లైట్లు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విమర్శలను సహించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, వైస్ ఫ్లోర్ లీడర్ బోడ్ల ఆనంద్, పూడుకారపు కిషోర్, కోయల్కర్ లింగేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు జుంగుల అనిల్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రీషియన్ ,3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు.ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు వేతనం,సివిల్ అసిస్టెంట్ సర్జన్ కి వేతనం రూపాయలు 52,351 ఉంటుందని,ఇతర వివరాలకు 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మద్యం సేవించిన వారికి జరిమానా

**ప్రజాపక్షం/బాల్కొండ:** మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఒకరిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. బండి తిరుమలేష్, ఎన్.శ్రీనివాస్‌లను ఆర్మూర్ కోర్టులో హాజరు పర్చగా జడ్జీ వారికి 4 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

## వారసంతలో చల్లని మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం / జన్నారం:** మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే వారసంతలో పూర్ణచంద్రరావు (పిసిఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. గత ఐదు వారాలుగా ఈ సేవా కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఎండ తీవ్రత దృష్ట్యా సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జన్నారం పట్టణ వ్యాపారి ఉత్తూరి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, ఫౌండేషన్ సభ్యులు నిముషకవి రాజేష్, భూమేష్, సత్యం పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో కూలీకి గాయాలు



**ప్రజాపక్షం / జన్నారం:** మండలంలోని కామన్‌పల్లి గ్రామానికి చెందిన మునిగెల లలిత (55) ఉపాధి హామీ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డారు. గ్రామానికి చెందిన శాంతయ్య భార్య అయిన లలిత 100 రోజుల ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆమెకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం లలితను లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఎంటి రమేష్, పైలట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేగాంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం / భైంసా :** భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఐ.కే.పి. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సిరం సుష్మారెడ్డి ప్రారంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు పొందాలన్నారు. ఐకేపి సిబ్బంది రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏ గ్రేడ్ రకానకి 2389 రూపాయలు, బి గ్రేడ్ రకానికి 2369 రూపాయలు ఉందన్నారు. ప్రారంభోత్సవ వార్డు సభ్యులు , గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



# పేరుకే చెక్‌పోస్టులు.. యథేచ్ఛగా అక్రమ రవాణా



**ప్రజాపక్షం / సిర్పూర్-టిః** మండలంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు తమ అసలు లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమవుతున్నాయని, ఇవి పేరుకే పనిచేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని హుడికిలి, వెంకట్రావుపేట్, పెద్దబండ గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన మూడు చెక్‌పోస్టుల్లో రెండు పాడి అక్రమ రవాణా నియంత్రణకు, ఒకటి పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే వీటి ద్వారా అక్రమ రవాణా ఏమాత్రం అదుపులోకి రావడం లేదని స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వెంకట్రావుపేట్ చెక్‌పోస్ట్ వద్ద గతంలో అక్రమ వ్యాపార వాహనాల నుంచి నగదు వసూలు చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియకపోవడం గమనార్హం. గత కొన్నేళ్లుగా ఈ కేంద్రాలు కొనసాగుతున్నప్పటికీ ఎన్ని కేసులు నమోదు చేశారు, ఎంత మేర అక్రమాలను అడ్డుకున్నారనే విషయంలో స్పష్టత లేదు. చెక్‌పోస్టులు ఉన్నా అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండటంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చెక్‌పోస్టుల పనితీరుపై సమీక్ష నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా శ్రీ నర నారాయణ స్వామి రామయజ్ఞం



**ప్రజాపక్షం / జన్నారం:** మండలంలోని కలమడుగు గ్రామంలో వెలసిన శ్రీ నర నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రామయజ్ఞం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ పూజారి రాజా నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తుల రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పవిత్ర మంత్రోచ్చారణల మధ్య యజ్ఞశాలలో నిర్వహించిన హోమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. యజ్ఞం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో సుమారు 103 మంది ఆంజనేయ స్వామి భక్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతల నాగమణి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమా ర్, పెద్దలు మల్లేష్, గౌరయ్య, విష్ణు పాల్గొన్నారు.

# మైనర్లకు మద్యం, సిగరేట్లు, అమ్మకంపై నిషేదం

**ప్రజాపక్షం / భైంసా :** దహేగాం గ్రామంలో డ్రగ్స్ , మారక ద్రవ్యాలపై అవగాణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. సుప్రియ మాట్లాడుతూ యువతతో పాటు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని, వారు ఎందుక్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాలను పంచుకున్నారు.

ఈ అవగాహన కార్యక్రమం సందర్భంగా, దహేగాం గ్రామంలో నేటి నుండి 10 18 సంవత్సరాల లోపు ఉన్న మైనర్లకు సిగరేట్లు మరియు మద్యపానియాలు విక్రయించకూడదని నిర్ణయం తీసుకున్నారు. అలాగే, 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా ఇటువంటి అసాంగిక కార్యకలాపాల్లో పాల్గొంటే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తామని గ్రా మస్థులు , దుకాణదారులు హామ ఇచ్చారు.

## తెలంగాణ రెండవ ఆర్థిక సంఘం సమావేశం

**ప్రజాపక్షం / భైంసా :** తెలంగాణ స్టే ఫైనాన్స్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో నిర్వహించిన వర్క్ షాప్‌కు దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి హాజరయ్యారు. ఫైనాన్స్ కమీషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య , ఫైనాన్స్ కమీషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నుండి ఇద్దరు సర్పంచులను ఎంపిక చేశారు. ఈ రీజనల్ స్థాయి సమావేశానికి జిల్లా నుండి అధికారులు, కొందరు ప్రజా ప్రతినిధులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల నుండి పలు సలహాలు సూచనలు స్వీరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ సిరం సుష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చేస్తున్న పనులను వివరించారు. సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పగా ఫైనాన్స్ కమీషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య సర్పంచ్ ను అభినందించారు తాను చేస్తున్న పనులకు అధికారులు ప్రోత్సహించి జిల్లా నుండి పంపినందకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

## గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### ప్రముఖ గుండె వ్యాధి డాక్టర్ జగన్నాథం

**ప్రజాపక్షం / భైంసా :** నేతి యువత గుండె వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ః జగన్నాథం అన్నారు. భైంసా మండలం మాటేగాం వద్ద ఆర్.ఎం.పి. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వ్యాధి అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత ఉరుకుల పరుగులు జీవితంలో తగినంత నిద్ర, ఆహారపు ఆలవాట్లను స్టడి చేయాలని అన్నారు సాధ్యమైనంత మట్టుకు ఆకుకూరలు భుజించి , క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలని తెలిపారు.

## సౌదీలో స్నేహితుడు అరెస్ట్ అంటూ మోసం

### రూ. లక్ష పోగొట్టుకున్న యువకుడు

**ప్రజాపక్షం/ఎడపల్లిః** సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడతో అమాయకులను నిలువునా ముంచేస్తున్నారు. తాజాగా ఎడపల్లి మండల కేంద్రంలో ఒక యువకుడు తన స్నేహితుడిని కాపాడుకోవాలనే ఆరాటంలో లక్ష రూపాయాలు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి కి చెందిన షేక్ గౌస్ పాషా(22) వృత్తిరీత్యా డ్రైవర్ గత నెల 20వ తేదిన అతడికి తన స్నేహితుడైన జుబేర్ వాట్సాప్ నంబర్ నుంచి ఒక మెసేజ్ వచ్చింది. తాను సౌదీ అరేబియాలో పోలీసులకు దొరికిపోయానని, వెంటనే రూ. లక్ష జరిమానా చెల్లిస్తే తప్ప విడుదల చేయరని ఆ మేసేజ్ సారాంశం. నిజంగానే తన స్నేహితుడు ఆపదలో ఉన్నాడని నమ్మిన గౌస్ పాషా ఫోన్ పే ద్వారా రూ. 50వేలు పంపాడు. ఆ తరువాత మిగిలిన రూ. 50వేల మొత్తాన్ని నెఫ్ట్ ద్వారా బదిలీ చేశాడు. డబ్బులు పంపిన కొద్దిసేపటికే గౌస్ ఫాషాకు మరో తెలియని నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తాను పోలీస్ అధికారినని, జుబేర్ తన కస్టడిలోనే ఉన్నాడని, అతడిని వదలాలంటే మరో లక్ష రూపాయాలు కావాలని ఆ మేసేజ్‌లో డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే ఎడపల్లి పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ మోసమని గ్రహించిన గౌస్ పాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వేధింపులపై కఠినంగా వ్యవహరించాలి



**ప్రజాపక్షం/ మావలః** మహిళలు, చిన్నారులకు భరోసా కేంద్రం అండగా నిలవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని భరోసా, షీ టీం కేంద్రాలను పరిశీలించిన ఆయన బాధితులకు తక్షణమే న్యాయ, వైద్యం సాయం అందించాలని సూచించారు, వేధింపులకు గురైతే డయల్ 100 లేదా షీ టీంను ఆశ్రయించాలని కోరారు, విద్యాసంస్థల్లో భద్రతా చట్టాలపై అవగాహన కల్పించాలని, ఆకతాయిలపై నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## అధ్వానంగా బరంపూర్ సకినాపూర్ రహదారి



**ప్రజాపక్షం/ తలమడుగుః** మండలంలోని బరంపూర్ గ్రామం నుండి సకినాపూర్ వెళ్లే రహదారి కోతకు గురై కంకర తేలి అధ్వానంగా తయారైంది, కొండపై ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు సకినాపూర్, నడింపల్లె, బరంపూర్ తదితర గ్రామాల ప్రజలు ఈ గుంతల రోడ్డుపై ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, రాత్రి సమయంలో వాహనాలు స్లిప్ అయి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన బీటీ రోడ్డు నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యాన పంటలతోనే రైతులకు లబ్ధి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ః** జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో రైతు వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సంర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ వంటి పంటల సాగుతో దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ

**ప్రజాపక్షం/ మావలః** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు చేపట్టినట్లు ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆదిలాబాద సొసైటీలో సేకరించిన తేనె నిల్వలను తనిఖీ చేశారు. 25 క్వింటాళ్ల తేనే, 122 క్వింటాళ్ల ఇప్పపువ్వు సేకరించినట్లు పేర్కొన్నారు. గిరిజనులు దళారులకు అమ్మి మోసపోకుండా, జీసీసీ డిపోలు లేదా సొసైటీ కార్యాలయాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఇస్తారి, సిబ్బంది గోవిందరావు, రమేష్, సవాయి రామ్ పాల్గొన్నారు.